క్లుప్తంగా

ఉసేన్‌స్వామి దర్గాలో భక్తుల రద్దీ


ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు గురువారం భక్తులు పోటెత్తారు. జిల్లాతో పాటు కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, తదితర జిల్లాల నుంచి భక్తులు తరలిరావడంతో దర్గా భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారికి పూలదట్టీలు, జెండాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

కొలిమిగుండ్ల: ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ ఆదేశాల మేరకు కల్వటాలలోని రామ్‌కో సిమెంట్ కంపెనీ గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ శశిధర్ వైద్య పరీక్షలు చేశారు. క్షయవ్యాధిగ్రస్తులకు రెండు నెలలకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. వ్యాధులపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. మొత్తం 106 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.మైన్స్ డీజీఎం అజ్మల్ అహ్మద్, డీఎం నాయుడు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌జేయూపీ సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. క్యాలెండర్లు, డైరీలను ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్తోజ్ వీరబ్రహ్మం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం షరీఫ్, హెచ్ఎం అరుణకుమారి విడుదల చేశారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఆర్‌జేయూపీ అలుపెరగని పోరాటం చేస్తోందన్నారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, సుధీరయ్య, నాగేశ్వరరెడ్డి, ధరణి, కృష్ణవేణి, నాగలక్ష్మి, సుగుణ, విజయలక్ష్మి, శ్రీదేవి, మృనాలిని, లక్ష్మి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు మెడికల్ కిట్లు


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

డోన్ రూరల్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం ఐసీడీఎస్ సీడీపీఓ షంషాద్‌బేగం అంగన్‌వాడీ కార్యకర్తలకు మెడికల్ కిట్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలను సక్రమంగా చూసుకోవాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలపై ఉందని తెలిపారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వారికి తెలియచేయాలన్నారు. రక్తహీనత బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. అత్యవసర సమయంలో ఈ కిట్లను వాడాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శకుంతల, పరమేశ్వరి, శోభారాణి, సుగుణమ్మ, కల్యాణి, పద్మావతి పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మిదేవి

ప్యాపిలి: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని సర్పంచ్ చెవిటి లక్ష్మిదేవి అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ప్రజలు తమ కాలనీల్లో నెలకొన్న సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకొచ్చారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. స్పందించిన సర్పంచ్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈఓ శివకుమార్ గౌడ్, ఏపీఓ వెంకటరమణ, హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, పీఎస్‌లు శిరీష, మోదిన్‌బీ పాల్గొన్నారు.

వంట.. తంటా

- గందరగోళంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం
- వంట సామగ్రి సరఫరా చేయకుండానే హడావుడి
- రేపటి నుంచే అమలుకు శ్రీకారం
- ప్రిన్సిపాళ్ల జేబులకు చిల్లు
- ఇప్పటికే కళాశాలలకు రావాల్సిన నిధులు రాక ఇబ్బందులు


బనగానపల్లె జూనియర్ కళాశాల

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామంటూ గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం అమల్లో మాత్రం చిత్తశుద్ధి చూపడం లేదు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జనవరి 1వ తేదీ నుంచి ఈ పథకాన్ని ప్రారంభిస్తామని తొలుత పేర్కొంది. మళ్లీ జనవరి 3 తేదీ అని.. ఆ తర్వాత 4వ తేదీ నుంచి అమలు చేస్తామని కళాశాలల ప్రిన్సిపాళ్లకు ఉత్తర్వులు జారీ చేసింది.ఈ పథకం అమలుకు కావాల్సిన వంట సామగ్రితో పాటు విద్యార్థులు భోజనం చేసేందుకు స్టీల్ ప్లేట్స్, గ్లాసలను ప్రిన్సిపాళ్లు కొనుగోలు చేయాలని పేర్కొంది. దీంతో కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల సంఖ్యను బట్టి సుమారు రూ. 7 వేల నుంచి రూ. 60 వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేశారు. వాటిని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పాఠశాల హెచ్ఎంల ద్వారా అందజేశారు. ముందుగా ప్రిన్సిపాల్స్ తమ సొంత నిధులు ఖర్చు చేసి ఆ తరువాత కళాశాలల పీడీ అకౌంట్స్ లేదా కళాశాలల స్పెషియల్ ఫండ్ కింద కొనుగోలు చేసిన సామగ్రికి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయనున్నట్లు సంబంధిత అధికారులు ఆదేశాలు ఇచ్చారు.

ఇప్పటికే కళాశాలల నిర్వహణ కోసం ప్రిన్సిపాళ్లు ఖర్చు చేసిన స్టేషనరీ తదితర బిల్లులు లక్షల్లో ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. మళ్లీ ఈ అదనపు భారం ఏంటని ప్రిన్సిపాల్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల వివరాలు ఇలా...

మండలం	మొదటి సంవత్సరం ఆర్ట్స్ అండ్ సైన్స్	రెండో సంవత్సరం ఆర్ట్స్ అండ్ సైన్స్
బనగానపల్లె	175	104
కోవెలకుంట్ల	246	148
అవుకు	102	86
కొలిమిగుండ్ల	87	35
సంజామల	37	12

బనగానపల్లె నియోజకవర్గంలో ఇలా..

బనగానపల్లె నియోజకవర్గంలో బనగానపల్లె, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లో మొత్తం ఐదు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ తదితర గ్రూపుల్లో 1032 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం 647 మంది, రెండో సంవత్సరం 385 మంది విద్యార్థులు ఉన్నారు.

వీరికి మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనున్నారు.

మధ్యాహ్న భోజన పథకం మెనూ


సోమవారం:	అన్నం, కూరగాయాల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కి
మంగళవారం:	పులగం, లేదా పులిహోర, పల్లీ చట్నీ, కొడిగుడ్డు ఫ్రై, రాగిజావా
బుధవారం :	అన్నం,సాంబరు, ఉడికించిన గుడ్డు, చిక్కి
గురువారం :	వెజిటబుల్ రైస్, గుడ్డుకూర, రాగిజావ
శుక్రవారం	అన్నం, ఆకుకూరతో పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కి
శనివారం :	అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగిజావ

మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఏర్పాట్లు పూర్తి



ఈ నెల 4వ తేదీ నుంచి కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. పథకం అమలుకు సంబంధించి వంట సామగ్రి విద్యార్థులకు కావాల్సిన ప్లేట్లు, గ్లాస్‌లను కొనుగోలు చేశాం. విద్యార్థులందరూ మధ్యాహ్న భోజన పథకం సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. –రాజిక సత్య ప్రపూర్ణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల,


ప్రిన్సిపాల్ కొనుగోలు చేసిన వంట సామగ్రి,


స్టడీ అవర్‌లో విద్యార్థులు

సావిత్రీబాయి సేవలు మరువలేనివి


హెచ్ఎంకు సావిత్రీబాయి పూలే చిత్ర పటాన్ని అందజేస్తున్న జడ్జి తంగమణి

డోన్ టౌన్: సమాజంలో బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యాభివృద్ధికి పాటుపడిన సమాజ సేవకురాలు సావిత్రిబాయి పూలేను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం సావిత్రిబాయి పూలే చిత్ర పటాలను మండలంలోని అన్ని పాఠశాలలకు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా జడ్జి మాట్లాడుతూ.. పూలే దంపతులు సత్యశోధక్ సమాజ్‌ను స్థాపించి సమాజ సేవకు వారి జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టారని చెప్పారు. వితంతు వివాహాలను ప్రోత్సాహించారని, మహిళా విద్య కోసం ప్రత్యేకంగా బాలికా పాఠశాలను ప్రారంభించారని తెలిపారు. ఈమె జ్ఞాపకార్థం మహారాష్ట్రలోని పూణేలో యూనివర్సిటీ స్థాపించారని చెప్పారు. లోక్ అదాలత్‌లో కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం పూలే చిత్రపటాలను హెచ్ఎంలకు అందజేశారు. జడ్జిని సంఘం నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం మైమున్నీసా, ఉపాధ్యాయులు లక్ష్మీనాయక్, గోపాల్, బాబు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

బేతంచెర్ల: కేంద్ర ప్రభుత్వం రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం బేతంచెర్లలోని లారీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో నాయకులు రామాంజనేయులు, బేతంచెర్ల ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, యూనియన్ గౌరవ అధ్యక్షుడు సాధిక్ హుస్సేన్ ఆధ్వర్యంలో లారీ, ఆటో, జీపు యూనియన్ నాయకులతో సమావేశం నిర్వహించారు. దేశాభివృద్ధిలో రవాణా రంగం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. అయితే కార్మికుల పరిస్థితి దుర్భరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం అందరం సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలిపారు. వచ్చే నెల జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమానికి రవాణా కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పంటల సాగుపై అవగాహన


వంగ పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డోన్ ఏడీఏ

బేతంచెర్ల: వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పంటల సాగుపై సలహాలు సూచనలు ఇవ్వాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డోన్ ఏడీఏ అశోక్ వర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గోరుమానుకొండ రైతు సేవ కేంద్రాన్ని వారు సందర్శించారు. అనంతరం గ్రామంలో రైతులు సాగుచేసిన అరటి, వంకాయ పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కంది పంట మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించారు. బేతంచెర్ల పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. వారి వెంట ఏఓ కిరణ్ కుమార్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

విద్యార్థినులకు ఆర్థిక సాయం


విద్యార్థినులకు ఆర్థిక సాయం చేస్తున్న సర్పంచ్ విద్య

డోన్ రూరల్: జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఫరహానా, సుచిత్రకు సర్పంచ్ విద్య ఆర్థిక సాయం చేశారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉత్తరాఖండ్‌లో ఈ నెల 8,10వ తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. వీరభద్ర, ఫిజికల్ డైరెక్టర్ సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

బేతంచెర్ల: ప్రార్థించే పెదవులకన్నా సహాయం చేసే చేతులు మిన్న అని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వీరారెడ్డి, ప్రశాంత్ అన్నారు. గురువారం పట్టణంలోని అన్నపూర్ణ అనాథాశ్రమ విద్యార్థులకు సాయి టిఫిన్ సెంటర్ నిర్వాహకులు రాజు, ఇందు దంపతుల సహకారంతో రోటరీ క్లబ్ సభ్యులు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు గుండా గోపాలు, గౌరి హుసేన్ రెడ్డి, సత్తార్, మాణిక్యం, రామూర్తి పాల్గొన్నారు.


అనాథాశ్రమ విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు


అమ్మవారికి సారె సమర్పించేందుకు వెళ్తున్న మహిళలు

గోదాదేవికి సారె సమర్పణ

డోన్: మండల కేంద్రంలో కొలువై ఉన్న గోదాదేవికి గురువారం మహిళలు సారె (వడిబియ్యం) సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ, రాము శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు. ముత్తయిదు మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ధర్మకర్తలు పాతాళం సుబ్బారావు, శ్రీనివాసరావ్, రజనీకుమారి పాల్గొన్నారు.


పూజలందుకున్న గోదాదేవి

నేడు ప్రజాభిప్రాయ సేకరణ సభ

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ ఆవరణలో శుక్రవారం పర్యావరణ అనుమతుల కోసం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వహించనున్నారు. రెండో ప్లాంట్ నిర్మాణం కోసం ఈ సభను ఏర్పాటు చేశారు. పొల్యూషన్ బోర్డు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు. కంపెనీ పరిధిలోని కల్వటాల, నందిపాడు, కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె, ఇటిక్యాల, నాయినపల్లె గ్రామాల రైతులు పాల్గొననున్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని అమడాల మెట్ట సమీపంలో గురువారం పేకాట ఆడుతున్న వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి పేకముక్కలు, రూ. 4,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

అంకిరెడ్డిపల్లెలో 8 మంది అరెస్ట్

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లెలో గురువారం పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.7వేల స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేశామని సీఐ పేర్కొన్నారు.

నేడు పూలే విగ్రహ ప్రతిష్ట

డోన్ టౌన్: స్థానిక గరల్స్ హైస్కూల్‌లో శుక్రవారం జ్యోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, డోన్ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. సమాజంలో బడుగుబలహీనవర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన పూలే దంపతుల విగ్రహాలను నెలకొల్పడం హర్షించదగ్గ విషయం అన్నారు.

నూతన వేడుకలు


ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

బేతంచెర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ ఆధ్వర్యంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మిస్పా వృద్ధాశ్రమంలో షాలెము చర్చి పాస్టర్ విద్యరాజు కేక్ కట్ చేసి, వృద్ధులకు అన్నదానం చేశారు.

విద్యా కమిటీ చైర్మన్‌లకు శిక్షణ

డోన్ టౌన్: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యా కమిటీ చైర్మన్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ప్రభాకర్, శిక్షణ కోఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత విద్యా కమిటీ చైర్మన్‌లపై ఉందన్నారు. తమ విధులను తెలుసుకుని పాఠశాల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల నిర్వాహణపై పర్యవేక్షణ, అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారా లేదా విజిట్ చేయవచ్చునని తెలిపారు. మౌలిక సదుపాయాలపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్స్ ఎల్లరాజు, మన్సూర్, రియాజ్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

వాడివేడిగా గ్రామసభ

- పంచాయతీ పాలక వర్గాన్ని విస్మరిస్తే ఊరుకోం. • అభివృద్ధిలో అందరినీ భాగస్వాములు చేయాలి


గ్రామ సభలో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన గ్రామ సభ వాడివేడిగా సాగింది. మేజర్ పంచాయతీలో సర్పంచ్ మెట్ల సరళ అధ్యక్షతన ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలు, పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చ జరిగింది. అధికారులు పాలకవర్గాన్ని విస్మరిస్తున్నారని ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి గ్రామసభ దృష్టికి తెచ్చారు. గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు సంబంధించి పాలకవర్గానికి ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీ పాలకవర్గంతో పని లేకుండా అభివృద్ధి పనులు చేసుకునే పక్షంలో పాలకవర్గానికి రాత పూర్వకంగా తెలియజేయాలని ఈఓ ప్రకాష్‌నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములైనప్పుడే అన్ని విధాలా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పంచాయతీ పాలక వర్గానికి ఎలాంటి అభ్యంతరం లేదని, అధికారులు దీన్ని రాజకీయ కోణంలో చూడకుండా వ్యవహరించాలని హితవు పలికారు. పాలకవర్గాన్ని పట్టించుకోకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఈఓ ప్రకాష్‌నాయుడు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నామని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ ఈఓగా పనిచేసి అనేక అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. వార్డుమెంబర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

డోన్ టౌన్: గీతా జయంతిని పురస్కరించుకుని వివేకానంద సేవా సమితి భగవద్గీతపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు.

స్థానిక శ్రీసుధ హైస్కూల్‌లో సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్, ప్రధాన కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సేవా సమితి ఉపాధ్యక్షుడు కుళ్లాయప్ప, కార్యదర్శి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

భూసమస్యల పరిష్కారానికే రీసర్వే

బేతంచెర్ల: మండలంలోని బుగ్గానిపల్లె గ్రామంలో రెవెన్యూ అధికారులు రీసర్వేపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ప్రకాశ్ బాబు మాట్లాడుతూ.. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి రీసర్వే చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు. రీసర్వే డీటీ మహేశ్వర్‌రెడ్డి, వీఆర్వో మద్దిలేటి స్వామి, మండల సర్వేయర్ నాగరాజు నాయక్ పాల్గొన్నారు.


బుగ్గానిపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది


నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

ఏబీ బర్ధన్‌కు నివాళి

బేతంచెర్ల: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ ఏబీ బర్ధన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఆ పార్టీ మండల కార్యదర్శి భార్గవ్, నాయకులు పాల్గొన్నారు.

దుకాణంలో అగ్నిప్రమాదం

డోన్ టౌన్: పట్టణంలోని షాదిఖానా రహదారిలో హరికి చెందిన దుకాణంలో గురువారం (బంక్) ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. బంక్ సమీపంలో చెత్తా చెదారంపై ఎవరో సిగరేట్ పీక పడేయడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.10 వేల విలువ చేసే వస్తువులు అగ్నికి ఆహుతైనట్లు సమాచారం. లీడింగ్ ఫైర్‌మెన్‌లు శ్రీరాములు, ప్రభాకర్, ఫైర్‌మెన్‌లు రాజశేఖర్, నాగేంద్రబాబు, ఆపరేటర్ రంగస్వామి ఉన్నారు.


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

బేతంచెర్ల: రాయలసీమ విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసిన డిగ్రీ ఫలితాల్లో బేతంచెర్ల జ్ఞాన సరస్వతీ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. రెండో సెమిస్టర్ బీఎస్సీ కంప్యూటర్ సైన్స్‌లో బషీరున్నిసా బేగం 8.69 గ్రేడ్ పాయింట్లు, నాల్గో సెమిస్టర్ బీఎస్సీ, బీజెడ్సీలో సంగీత 8.92 గ్రేడ్ పాయింట్లు సాధించారని తెలిపారు. మనిషా 8.79 పాయింట్లు, బీకాం కంప్యూటర్‌లో పవన్ కుమార్ 7.95, శివ కుమార్ 7.58 గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను అభినందించారు.